క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ పాషాకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి బాధితుడికి బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహ్మద్‌గౌస్ పాషా ఆర్థికసాయం కోసం సీఎంఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మెరుగైన చికిత్స పొందేందుకు ప్రభుత్వం ద్వారా రూ.2.50లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, రమేశ్, బషీర్, సుధీర్, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు

కొత్తూరు: వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి గోపాల్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐదు ఎకరాలలోపు ఉన్న భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు యాభై శాతం, మిగితా వారికి నలభై శాతం సబ్సిడీతో యంత్రాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాటరీ స్ప్రేయర్లు, సీడ్, ఫర్టిలైజర్ డ్రిల్స్, డ్రం సీడర్, కల్టివేటర్, బాండ్ ఫార్మర్, పవర్ టిల్లర్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్‌కార్డు, ట్రాక్టర్ పరికరాల కోసం ఆర్‌సీ బుక్, రెండు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్మికుల వేతనాల చెల్లింపుపై హర్షం



కమిషనర్ వెంకటేశంను సన్మానిస్తున్న సీఐటీయూ నాయకులు

చేవెళ్ల: చేవెళ్లలో మున్సిపల్ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించటంపై సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కమిషనర్ వెంకటేశంను కలిసి శాలువాతో సన్మానించి కార్మికులకు జీఓ ప్రకారం వేతనాల చెల్లింపు అమలు చేయటంపై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల వేతనాల కోసం యూనియన్ ఆధ్వర్యంలో చేసిన పోరాటలు ఫలించాయన్నారు. ఈ వేతనాలతో కార్మికుల కుటుంబాల్లో సంతోషం నిండుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జి.నరేశ్, సీ.నరేశ్, దస్తగిరి, జనార్దన్, వెంకటయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

చేవెళ్ల: మండల కేంద్రంలోని ఈశ్వరీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11:30 గంటలకు మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ సన్మాన కార్యక్రమం ఉంటుందని మండల విద్యాధికారి ఎల్.పురన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరవుతున్నారని, మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నత్తే నయం!



కంకర తేలి అధ్వానంగా మారిన శంకర్‌పల్లి-చేవెళ్ల రహదారి

- ఐదేళ్లుగా ముందుకు సాగని శంకర్‌పల్లి-చేవెళ్ల రోడ్డు విస్తరణ పనులు
- గుంతలు, కంకర తేలడంతో వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

శంకర్‌పల్లి: పట్టణం నుంచి వికారాబాద్, చేవెళ్ల వైపు వెళ్లే రహదారి విస్తరణ పనులను చూస్తే.. నత్తనడకే నయమేమో అన్న అభిప్రాయం కలుగుతోంది. పనులు ప్రారంభించి ఐదేళ్లు గడుస్తున్నా.. నేటికీ పూర్తి కాలేదు. రోజు సుదూర ప్రాంతాల నుంచి నగరానికి కూరగాయలు తీసుకొని వెళ్లే రైతులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుత్తేదారు నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి, వాహనదారుల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

2020లో ప్రారంభం

శంకర్‌పల్లి పట్టణ చౌరస్తా నుంచి ఫత్తేపూర్ రైల్వే వంతెన వరకు(చేవెళ్ల,వికారాబాద్ వైపు వెళ్లే రహదారిలో) కిలోమీటరు మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ పనులకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3.06కోట్లను మంజూరు చేయగా..నాటి విద్యాశాఖ మంత్రి 2020 జూలైలో శంకుస్థాపన చేశారు.ప్రణాళిక ప్రకారం విస్తరణ పనులు ఆరునెలల్లో పూర్తి కావాల్సిన ఉంది.కానీ ఐదేళ్లు గడిచినప్పటికీ నేటికీ పూర్తి కాకపోవడం గమనార్హం.

గుంతల్లో మట్టి పూడ్చి..

శంకర్‌పల్లి రహదారిపై నిత్యం వికారాబాద్, చేవెళ్ల, నవాబ్‌పేట్, మోమిన్‌పేట్, మర్పల్లి తదితర మండలాల నుంచి వేలాది మంది రైతులు తమ కూరగాయలను నగరంలోని పలు మార్కెట్‌లకు తీసుకొని వెళ్తారు. అదేవిధంగా విద్యార్థులు, ఉద్యోగస్తులు నిత్యం పాఠశాల, కళాశాల, ఆఫీసులకు వెళ్లేందుకు ఈ రహదారినే ఉపయోగించుకుంటారు. పనుల్లో భాగంగా రోడ్డుపై అరకొరగా వేసిన కంకర, డస్ట్ అంతా ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రోడ్డుపై పెద్దఎత్తున గుంతలు, కంకర రాళ్లు తెలిపోయి ఉన్నాయి. స్థానికులు ఫిర్యాదు చేయడంతో శంకర్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు పలుమార్లు తాత్కాలికంగా గుంతల్లో మొరం వేసి పూడ్చినప్పటికీ, మళ్లీ యథాస్థితికి వస్తోంది. పనుల జాప్యంపై ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగే ప్రయత్నం చేయగా.. పనులు దక్కించుకున్న సదరు గుత్తేదారు సక్రమంగా పని చేయడం లేదని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నారు.

పరిశీలనకే పరిమితం

శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల, వికారాబాద్ వెళ్లే రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాల గురించి శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్ ఆరా తీశారు. రహదారి విస్తరణ పనులు పూర్తి అయితే సమస్యలు తగ్గుతాయని గుర్తించి, ఆర్‌అండ్‌బీ డీఈఈ రమేశ్, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి సంయుక్తంగా గత ఫిబ్రవరి 25న రోడ్డును పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనులను దక్కించుకున్న సదరు గుత్తేదారుడి తప్పింది మని, మిగిలిన పనులకు సంబంధించి మళ్లీ అంచనా వేసి, టెండరు పిలవనున్నట్లు తెలిపారు. గడిచిన రెండేళ్లుగా అధికారులు 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెబుతూ, పరిశీలించి గాలికి వదిలేయ్యడమే తప్పా.. చేసిందేమి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సమస్యగా దుకాణాలు

ఈ రహదారి పక్కన కొన్నేళ్ల నుంచి పదుల సంఖ్యలో కొంత మంది చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఖచ్చితంగా ఈ దుకాణాలను తొలగించాల్సి ఉంటుంది. అయితే వారిని ఎలా ఖాళీ చేయించాలి అనే విషయంపై అధికారులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

పట్టించుకోవడం లేదు

శంకర్‌పలి-చేవెళ్ల రోడ్డు విస్తరణ పనుల జాప్యంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి పూట గుంతలను సరిగా అంచనా వేయలేక పలువురు క్షతగాత్రులయ్యారు. దీనిపై ఇప్పటికే మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రానున్న రోజుల్లో దీనిపై పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.

– దయాకర్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు



చేవెళ్లలో పాఠశాల ఎదుట నీరు నిలవడంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



చేవెళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన ద్వారం వద్ద నిలిచిన నీరు

చెరువులను తలపిస్తున్న రోడ్లు

- పాఠశాలల ఎదుట, కాలనీల ప్రధాన ద్వారాల్లో నిలిచిన నీరు
- విద్యార్థులు, స్థానిక ప్రజలకు తప్పని తిప్పలు
- శాశ్వత పరిష్కారం చూపించాలని వినతి

చేవెళ్ల: వర్షం పడితే చాలూ పలు రోడ్లు ప్రధాన ద్వారాలు, పాఠశాలల గేట్‌ల వద్ద వర్షపునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. లోపలికి వెళ్లే దారుల్లోనే నీళ్లు నిలవటంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి చేవెళ్లలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల గేట్ ఎదుట వర్షపునీరు నిలిచి చెరువులను తలపించాయి. దీంతో సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులు బయటికి రావడానికి ఇబ్బంది పడ్డారు. కొందరు విద్యార్థులు నీళ్లలో పడిపోయి తడిచిపోయారు. ఎప్పుడు వర్షం పడిన విద్యార్థులకు తిప్పలు తప్పటం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల ముందు నిలిచే వర్షపు నీటిని సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని 1989-90 ఏడో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డి, అమర్, నందు, భానుప్రకాశ్, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు తెలిపారు. పాఠశాల దసరా సెలవులలో ఈ పనులు చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా చేవెళ్లలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, హౌసింగ్ బోర్డుకు వెళ్లే దారిలో వర్షపునీరు వెళ్లే మార్గం లేకపోవటంతో వర్షం పడితే చాలూ చెరువులా మారుతోంది. చాలాసార్లు ఈ రోడ్డుపై నీరు వెళ్లేందుకు మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

మొయినాబాద్‌లో వర్షం

మొయినాబాద్: మున్సిపల్ కేంద్రంతో పాటు పెద్ద మంగళారం, చిలుకూరు, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎనికేపల్లి, ముర్తూజగూడ, సురంగల్ తదితర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం వర్షం పడింది. దీంతో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై అక్కడక్కడ నీరు నిలిచాయి. అదేవిధంగా మొయినాబాద్, హిమాయత్‌నగర్ చౌరస్తా, అజీజ్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు.



మొయినాబాద్‌లో రోడ్డుపై నిలిచిన వరదనీరు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



అలుగు పారుతున్న చందనవెళ్లి పెద్దచెరువు



నిండుగా ప్రవహిస్తున్న తాళ్లపల్లి వద్ద ఈసీ వాగు

షాబాద్: మండలంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఈసీ వాగు నిండుగా పారుతోంది. మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, నాగర్‌గూడ గ్రామాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. అదేవిధంగా చందనవెళ్లి గ్రామ పెద్దచెరువు అలుగు పారుతోంది.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని వినతి



షాద్‌నగర్: తహసీల్దార్ నాగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

షాద్‌నగర్: రీజనల్ రింగు రోడ్డు నిర్మాణంలో ప్రస్తుతం ఇచ్చిన మార్కింగ్‌ను మార్చాలని అయ్యవారిపల్లి, చించోడ్ గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ నాగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి అధికారులు ఇచ్చిన మార్కింగ్‌ను మార్చాలని కోరారు. గతంలో ఇచ్చిన మార్కింగ్ ప్రకారంగా పనులను చేపడితే రైతులకు ఎలాంటి నష్టం జరగదన్నారు. ప్రస్తుతం 486 నుంచి 499, 504 నుంచి 689 వరకు ఉన్న సర్వే నంబర్ల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు వేస్తామని అధికారులు ప్రకటించారన్నారు. అయా సర్వే నంబర్ల మీదుగా రోడ్డు నిర్మిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపించారు. గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రస్తుత రోడ్డు మార్కింగ్‌తో దాదాపు 300ల మంది రైతులు భూములను కోల్పోతారని, దీంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో ఇచ్చిన మార్కింగ్ ప్రకారం రోడ్డు నిర్మాణం చేపట్టాలని, రీజనల్ రింగు రోడ్డు విషయంలో ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాలని కోరారు. వారికి సీపీఎం పార్టీ నాయకులు తమ పూర్తి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రకాంత్, రజనీకాంత్, సత్యం, సాయన్న, సత్తయ్య, మమత, లక్ష్మయ్య, నగేశ్, శ్రీధర్‌నాయక్, సూర్యానాయక్, భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలని వినతి

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని మండలంలోని తంగెల్లపల్లి గ్రామస్తులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌తో మా పచ్చని పొలాలు రోడ్డులో పోయి తమ బతుకులు రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు తగు విచారణ జరిపి రోడ్డు అలైన్‌మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు మైపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, జంగయ్య, మల్లేశ్, హనుమంతు, వెంకటేశ్ పాల్గొన్నారు.



మొయినాబాద్: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



శంకర్‌పల్లి: పట్టణంలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్ల: విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. ఐలమ్మ ధైర్య సాహసాలు,చైతన్యం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



షాద్‌నగర్‌రూరల్: విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



షాబాద్: మండల కేంద్రంలో..



కొందుర్గు: మండల కేంద్రంలో..



నందిగామ: మండల కేంద్రంలో..

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



చెరువు కట్ట పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఇటీవల సెట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టిన పట్టణంలోని సాయిరెడ్డి చెరువును ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుమారు 33 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును రూ.కోట్లతో మరమ్మతులు చేపట్టడం సంతోషకరమన్నారు. సెట్రీస్ సంస్థను ఆదర్శంగా తీసుకొని మిగితా పరిశ్రమల యాజమాన్యాలు కూడా చెరువులు, కుంటల అభివృద్ధికి తమవంతు సాయం చేయాలని పిలుపునిచ్చారు. చెరువుకు చేపట్టిన మరమ్మతుల కారణంగా నీటినిల్వ సామర్థ్యం పెరిగిందన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. రోడ్డు పనులకు పొలాల యజమానులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, సురేందర్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల



షాద్‌నగర్‌రూరల్: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్, సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు తుది జాబితాను విడుదల చేశామని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో కలిసి తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని 47 గ్రామ పంచాయతీలు ఉండగా.. 89 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్‌లు నవీన్‌కుమార్, జెరుషా, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు తుది జాబితా ప్రదర్శించామని ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వారు సంబంధిత అధికారులతో కలిసి 55 పోలింగ్ కేంద్రాల ఓటరు లిస్టును వారు ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రెహమాన్, రాజు పాల్గొన్నారు.

ఎన్నికలకు అందరూ సహకరించాలి

శంకర్‌పల్లి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఇన్‌చార్జీ ఎంపీడీఓ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని 24 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు తుది జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రదర్శించారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సైతం ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిరాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేత



కొందుర్గు: అవార్డులు అందుకుంటున్న ఉపాధ్యాయులు



చేవెళ్ల: అవార్డు అందుకున్న కమ్మెట పాఠశాల ఎస్‌జీటీ కె.రవీందర్‌రెడ్డి



షాద్‌నగర్‌రూరల్: అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు అరుణ

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కొందుర్గు ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు దశరథ్, హిమబిందు, తంగెళ్లపల్లి అనురాధ, ముట్పూర్ దేవేందర్ రెడ్డి, లాలపేట రమేశ్ ఎంపికయ్యారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి సంబంధించి చౌదరిగూడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్‌గౌడ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శివలింగమ్మ, పెద్దఎల్కిచర్ల కృష్ణ, పీర్జాపూర్ సరిత ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ సుశీందర్‌రావు చేతులమీదుగా వారందరూ అవార్డులు అందుకున్నట్లు ఎంఈఓలు గాయత్రీదేవి, కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

చేవెళ్ల మండలంలో 10 మంది ఎంపిక

చేవెళ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10 మంది ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వారందరూ ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ అసిస్టెంట్లు కె.శంకర్(కమ్మెట), కె.దయానందం(దేవునిఎర్రవల్లి), ఎస్.విజయగౌరి(ఆలూరు), ఎన్.లక్ష్మీ(చేవెళ్ల), వెంకటరమణకుమార్(చేవెళ్ల), ఎస్‌జీటీలు కె.రవీందర్‌రెడ్డి(కమ్మెట), శశికళ(కేసారం), దయానందం(కుమ్మెర), మల్లయ్య(దేవునిఎర్రవల్లి), రమేశ్(కమ్మెట) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరందరికి తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అరుణ

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద కేజీబీవీ ప్రత్యేకాధికారి అరుణ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఉపాధ్యాయులు అరుణను శాలువాతో సత్కరించారు. ఆమెను డీఈఓ సుశీందర్‌రావు, ఎంఈఓ మనోహర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.